క్లుప్తంగా

కొనసాగుతున్న ప్రతిష్ఠోత్సవాలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో కలశ పూజ చేస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో పలువురు దేవతా మూర్తుల విగ్రహ,ధ్వజ ప్రతిష్ఠోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా నాలుగో రోజు గురువారం వేద పండితులు వివిధ రకాల పూజలు, జపాలు, పారాయణాలు, హోమాలు నిర్వహించారు. శుక్రవారం ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ గావించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆర్థిక సాయం

నంద్యాల(అర్బన్): ఆది అరుంధతి తప్పెట కళాకారుల సంఘం నాయకులు బాలసుబ్బయ్య, గోపాల్ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన తప్పెట కళాకారుల కుటుంబాలకు గురువారం రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. స్థానిక సంఘం కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో నాయకులు బాలసుబ్బయ్య, గోపాల్ మాట్లాడుతూ పెద్ద మౌలాలి, నాగపుల్లయ్య, ఆనందం ఇటీవల మృతి చెందడంతో కుటుంబాలకు అండగా నిలవాలని ఆర్థిక సాయం అందజేశామని చెప్పారు. జోజప్ప, నాగేష్, చౌడయ్య, మధుభాస్కర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

శ్రీశైలం వన్‌టౌన్ కానిస్టేబుల్ హఠాన్మరణం



నవరత్నారావు, కానిస్టేబుల్ (ఫైల్)

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నవరత్నారావు (53)గుండెపోటుతో హఠాన్మరణం చెందారని వన్‌టౌన్ పోలీసులు గురువారం తెలిపారు. బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఉండగా హఠాత్తుగా ఫిట్స్ రావడంతో వెంటనే దేవస్థానం వైద్యశాలకు తరలించామని చెప్పారు. అక్కడ డాక్టర్లు ప్రథమ చికిత్స నిర్వహించి ఫిట్స్ నివారించగలిగినప్పటికీ తీవ్ర స్థాయిలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు నిర్ధారించారని చెప్పారు. నంద్యాలలోని వారి బంధువులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. గురవారం ఉదయం ఆయన మృతదేహాన్ని శ్రీశైలం నుంచి నంద్యాలకు తీసుకువెళ్లినట్లు చెప్పారు. వన్‌టౌన్, టూ టౌన్ పోలీసులు ఆయన మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవ స్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను ఈఓ , అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

వైద్యశాలలో మందులను సిద్ధంగా ఉంచుకోండి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అవసరం అయ్యే మందులన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులను ఈఓ ఎస్ లవన్న ఆదేశించారు. గురువారం శివదీక్షా శిబిరాలు, కల్యాణకట్ట, పాతాళగంగ, ఏపీ టూరిజం, దేవస్థాన వైద్యశా ల, సామన్ల భద్రపరుచుగది తదితర వాటిని పరిశీలించి, సంబంధింత అధికారులకు పలు సూచనలు చేశారు. వైద్యశాలకు అవసరం అయిన మందులన్నింటిని సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు. వైద్యుల సూచనల మేరకు కావాల్సిన ఔషధాలను సమకూరుస్తూ ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎవరైనా అపాయస్థితిలో ఉన్నప్పుడు తక్షణ వైద్యాన్ని అందించగలగాలన్నారు. మరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అంబులెన్స్‌లను కూడా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈఈ వి.రామకృష్ణ, ఏఈఓ ఫణిదర్‌ప్రసాద్, డీఈ చంద్రశేఖర్‌శాస్త్రి, పీఆర్వో టి.శ్రీనివాసరావు, ఏఈ రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె–సిమెంట్ నగర్ గ్రామాల మధ్య ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పెట్రోల్ సిబ్బంది గురువారం తెలిపారు. సిమెంట్ నగర్‌కు చెందిన రవి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదరుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో రవికి కాలు విరగడంతో 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



బోడెమ్మనూరులో హెచ్ఎం చంద్రశేఖరయ్యకు రూ.10లక్షల చెక్కు అందజేస్తున్న పోచా వెంకటరెడ్డి



దొర్నిపాడులో జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, అధికారులు



రుద్రవరం రెవెన్యూ కార్యాలయం వద్ద గౌరవ వందనం స్వీకరిస్తున్న తహసీల్దార్



నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

ఘనంగా గణతంత్ర వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: 74వ గణతంత్ర దినోత్సవ వేడకలు నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో గురువారం ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ, జడ్జీలు, డీఎల్‌డీఓ, ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, ఎంపీపీలు, పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. పలువురు వక్తలు గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. వేడుకల సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

➡ నంద్యాల పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జేసీ నిశాంతి జాతీయ జెండా ఎగురవేసి గౌరవవందనం సమర్పించారు. అలాగే జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమణ ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయ ఆవరణలో పోలీస్ అధికారులు జెండా ఎగురవేసి వందనం చేశారు. డీఆర్‌ఓ కార్యాలయంలో డీఆర్‌ఓ పుల్లయ్య, వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీఏఓ మోహనరావు, మున్సిపల్ కార్యాలయంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి , ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా, చైర్‌పర్సన్ మాబున్నీసా, కమిషనర్ రవిచంద్రారెడ్డి, మార్కెట్ యార్డులో మార్కెట్‌యార్డు చైర్మన్ పోలూరు మహేశ్వరరెడ్డి, ఆర్‌ఏఆర్‌ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో కలిసి ఏడీఆర్ వెంకటేశ్వర్లు జెండా ఎగురవేశారు.





నంద్యాలలో విజయ డెయిరీలో జెండా వందనం చేస్తున్న చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, కోర్టు ఆవరణలో మాట్లాడుతున్న జిల్లా జడ్జీలు వాసు, రాధారాణి

➡ **ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలి..**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని అందరం గౌరవించాలని మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు అన్నారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కోర్టు ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం జాతీయజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రాధారాణి, స్పెషల్ క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది శ్రీనివాసులు, కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు. నూనెపల్లెలోనున్న డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్యాలయ ఆవరణలో డీఎల్‌డీఓ భాస్కర్ , ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ బ్రహ్మం నాయక్ జెండా వందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యాలయంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు నరసింహుడు, ఏపీ ఎన్‌జీఓస్ కార్యాలయంలో ఎన్‌జీఓస్ అధ్యక్షుడు మణిశేఖర్‌రెడ్డి, కార్యదర్శి హుసేన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు, డివిజన్‌స్థాయి పంచాయతీ రాజ్ కార్యాలయ ఆవరణలో పంచాయతీరాజ్ శాఖ ఈఈ రామ్మోహన్, దివ్యాంగుల, ఐఎంఏ సంఘం కార్యాలయంలో గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, విజయ డెయిరీ చైర్మన్ ఎస్‌వీ జగన్‌మోహన్‌రెడ్డి, ఎండీ పరమేశ్వరరెడ్డి, ఏడీఎం రాజేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు, చింతలయ్య ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు.

ఉయ్యాలవాడ : మండలంలోని బోడెమ్మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బర్డ్స్ సంస్థ రూ.10 లక్షలు అందజేసింది. గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకల అనంతరం హెచ్ఎం చంద్రశేఖరయ్యకు సంస్థ అధ్యక్షుడు పోచా వెంకటరెడ్డి ఇందుకు సంబంధించిన చెక్కు అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ 2015 సంవత్సరం నుంచి విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు వీలుగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించారన్నారు. ఇప్పటి వరకు రూ.23 లక్షలను నిర్వాహకులు సేకరించారన్నారు. బస్సు నిర్వహణ కోసం భవిష్యత్‌లో ఎవ్వరినీ సహాయం అడగకుండా ఉండేందుకు రూ. 10 లక్షల డిపాజిట్ అందజేశారని చెప్పారు. బర్డ్స్ ప్రతినిధి కర్నాటి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో ఏపీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జెండాను ఎగురవేస్తున్న దృశ్యం



కలెక్టర్ కార్యాలయంలో జెండాకు వందనం సమర్పిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



నంద్యాలలోని ఎస్పీ కార్యాలయంలో జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి



నంద్యాలలోని దివ్యాంగుల కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ



నంద్యాలలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న దృశ్యం



టెక్కె మున్సిపల్ స్కూల్‌లో జెండా ఎగురవేస్తున్న దృశ్యం



గోస్పాడులో జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ, ఉపాధ్యక్షులు, అధికారులు



గోస్పాడు మోడల్ స్కూల్‌లో విద్యార్థుల విన్యాసాలు

సంఘమిత్ర సేవలు ప్రశంసనీయం



సంఘమిత్ర ఆవాస కేంద్రం విద్యార్థులతో కలెక్టర్,ఎస్పీ, ఇతర అధికారులు

నంద్యాల: సంఘమిత్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ బాలుర ఆవాస కేంద్రం సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆర్‌డీఓ శ్రీనివాసులు, ఏఎస్పీ రమణ అభినందించారు. వసంత పంచమిని పురస్కరించుకొని గురువారం కేంద్రాన్ని సందర్శించి సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్.. విద్యార్థుల క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. బాగా చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల మనోభావాలను ప్రశ్నించగా వారు అభిప్రాయాలను తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థానాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ ఉదయ్‌శంకర్, కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసులు సంఘమిత్ర సేవలను వివరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కమిషనర్ రవిచంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

యువకుడికి డెంగీ లక్షణాలు

రుద్రవరం: మండలంలోని ఆలమూరులో అర్షద్ ఆయూబ్ అనే యువకుడికి డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. వైద్య బృందం ,గ్రామ పంచాయతీ అధికారులు తెలిపిన వివరాల మేరకు..అర్షద్ పొద్దుటూరులో ఉండేవాడని, జ్వరం సోకినట్లు గుర్తించి అక్కడ వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోగా డెంగీ లక్షణాలు ఉన్నట్లు అనుమానం ఉందని, కర్నూలు వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు. అయితే ఆ యువకుడు కర్నూలు వెళ్లకుండా పార్వేట ఉత్సవాలు తిలకించేందుకు ఆలమూరుకు చేరు కున్నాడు. విషయం తెలుసుకొని వైద్య, గ్రామ పంచాయతీ అధికారులు అర్షద్ ఇంటి పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, అబెట్ ద్రావణం పిచికారీ, దోమల వ్యాప్తి అరికట్టేందుకు ఫాగింగ్ చేయించారు. గ్రామంలో డెంగీ ప్రబలకుండా చర్యలు చేపట్టామని వారు చెప్పారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! నా క్లయింట్ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ సిటీవారు గుర్తికొండ రాకేష్ గారు ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని కొనుగోలు చేయుటకు కర్నూలు జిల్లా ఇప్పటి నంద్యాల జిల్లా గోసుపాడు మండలం, గోసుపాడు గ్రామ పంచాయతీలోగల ఆగ్రత ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ తరుపున ప్రెసిడెంట్ అయిన చిలుకల లింగన్నగారి కుమారుడు చిలుకల శ్రీనివాసులుగారితో క్రయ ఒప్పందంకుదుర్చుకొని బయానా సొమ్ము ఇచ్చియున్నారు. కావున సదరు షెడ్యూల్ ఆస్తిపైన సొసైటీకి సంబంధించిన వారికి గాని లేదా ఇతరులు ఎవరికైనా కాని హక్కులు ఉన్నట్లు గానీ లేదా వేరే ఏ విధమైన అభ్యంతరములు ఉన్నచో సదరు హక్కు పత్రములు తీసుకొని ఈ దిగువ అడ్రస్‌ప ఈ ప్రకటన వెలువడిన 15 రోజులలోపుగా వారియొక్క అభ్యంతరములు తెలియజేసి హక్కు పత్రములు దాఖలు చేయవలసినది. 15 రోజులలోగా ఏవిధమైన అభ్యంతరములు తెలియజేయనిచో సదరు ఆస్తి నిర్వివాదమైన నిష్కటిగల ఆస్తిగా భావించి, నా క్లయింట్ మిగిలిన సొమ్ము యావత్తు చెల్లించి ఆయన పేరున గాని ఆయన తరుపున వేరొకరి పేరున గాని క్రయమైన దస్తావేజు పొందగలరు.

షెడ్యూలు : ఆంధ్రప్రదేశ్, కర్నూలు జిల్లా, ఇప్పటి నంద్యాల జిల్లా, సిరివెళ్ళ సబ్-రిజిస్ట్రార్ పరిధిలోని గోసుపాడు మండలం, గోసుపాడు పంచాయతీ పరిధిలోని గోసుపాడు గ్రామములో గల ఆర్.యస్.నెం. 32ఎ దాఖలా య. 0-49 సెంట్లు లేక 0.199 హెక్టార్లు మరియు ఆర్.యస్.నెం. 33 ఎ దాఖలా య. 1-00 సెంట్లు లేక 0.405 హెక్టార్లు వెరసి య. 1-49 సెంట్లు లేక 7211.6 గజాల స్థలములో వాయవ్య మూల 1768.22 చదరపు గజాల స్థలమునకు హద్దులు :
తూర్పు : ఆగ్రత ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి స్థలము
దక్షిణం : ఆగ్రత ఎడ్యుకేషనల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి స్థలము
పడమర : నంద్యాల కోయలకుంట్ల రోడ్డు
ఉత్తరం : కరావల వెంకటన్న గారి భూమి
ఈ హద్దుల మధ్య 1768-22 చదరపు గజముల స్థలము మరియు ఈజిమెంట్ హక్కులతో సహ.

ఇట్లు
నెక్కరగంటి నరసింహారావు
అడ్వకేట్, రోడ్ నెం.2, ప్లాట్ నెం. 21,
మోతెవారి తోట, అశోక్‌నగర్, ఏలూరు,
ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్ : 9848118984

విభజన హామీలు సాధిద్దాం

నంద్యాల(అర్బన్): రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. సీపీఎం, సీపీఐ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, వామపక్ష, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం పద్మావతినగర్‌లో యువజన, విద్యార్థులతో బహిరంగ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన ద్వారా రాష్ట్రానికి అన్ని రంగాల్లో నష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన జాతీయ స్థాయి ఉన్నత విద్యాసంస్థలు, పరిశ్రమల ఏర్పాటు జరగలేదన్నారు. భావి తరాల కోసం సాగుతున్న ఉద్యమాన్ని ప్రజలు జయప్రదం చేయాలని కోరారు.



సమరయాత్రలో పాల్గొన్న యువజన విద్యార్థి సంఘాల నాయకులు

యాత్రలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ ప్రత్యేక హోదా విభజన హామీలు నెరవేర్చేంత వరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబాఫక్రుద్దీన్, లెనిన్ బబు, రాజేంద్ర, జాన్సన్‌బాబు, శివారెడ్డి, రాజశేఖర్, రామన్న, అశోక్ ఉన్నారు.

రైతులను క్షోభపెడితే పుట్టగతులుండవ్

నంద్యాల(అర్బన్): కేంద్ర ప్రభుత్వం రైతులను క్షోభ పెట్టడం మానుకోవాలని, లేకపోతే ఆ పార్టీకి ప్రజలు పుట్టగతులు లేకుండా చేస్తారని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే మరోమారు ఢిల్లీలో పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నం మానుకోవాలంటూ గురువారం పట్టణంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులపై ఉన్న అన్ని రకాల అప్పులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సుధాకర్, రామచంద్రుడు, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, మార్క్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

వైభవంగా వసంత పంచమి వేడుకలు



సంజీవనగర్ రామాలయంలో సరస్వతీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రథమ నంది గాయత్రి ఆలయంలో పెన్నుల అలంకారంలో సరస్వతీదేవి



సంజీవనగర్ రామాలయంలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

నంద్యాలవ్యవసాయం: మాఘ శుద్ధ పంచమి, చదువుల తల్లి సరస్వతీదేవి పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక ప్రథమనంది దేవస్థానంలో గురువారం గాయత్రి దేవాలయంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు, హోమాలు నిర్వహించి, అమ్మవారిని పెన్నులతో అలంకరించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అమ్మవారి కంకణాలు, పెన్నులు అందజేశారు. సుధీర్, మాజీ శాస్త్రవేత్త రవీంద్రనాథ్, కేశవమూర్తి, నాగేంద్ర, ప్రశాంతి పాల్గొన్నారు. అలాగే సంజీవనగర్ రామాలయంలోని శ్రీకోదండ రామాలయంలో వెలసిన సరస్వతీదేవి అమ్మవారికి శ్రీభగవత్‌సేవా సమాజ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక ఉచిత లక్ష కుంకుమార్చన కార్యక్రమం జరిపించారు.

ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయం

ఓర్వకల్లు: ప్రజల కష్టాలు తొలగాలంటే ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలని శ్రీ త్రిదండి చిన్న శ్రీరామన్నారాయన రామానుజ జీయర్(చిన్న జీయర్)స్వామి అన్నారు. గురువారం మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో నూతనంగా చేపట్టిన భూనీళా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి చిన్న జీయర్ స్వామి శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన బైరాపురం శ్రీలత, రామమోహన్‌రెడ్డి ఆహ్వానం మేరకు చిన్న జీయర్ స్వామితో పాటు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ మురళీధర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ మానవుడు ప్రశాంతగా జీవించాలంటే చుట్టూ ఉన్న ప్రకృతిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ టీటీడీ ఆర్థిక సహకారంతో రూ.10 లక్షల ఖర్చు చేసి ఎస్సీ, ఎస్టీలకు దివ్యదర్శనం పేరుతో ఉచిత బస్సుల ద్వారా శ్రీవారి దర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు. నందికొట్కూరుకు చెందిన లలితశ్రీ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

యవ్వన కాలమున దేవుడి సన్నిధిలో జీవించాలి

నంద్యాల(అర్బన్): యవ్వనస్తులు చెడు మార్గాలకు దూరంగా ఉండి దేవుడి సన్నిధిలో జీవించాలని సిస్టర్ సునేమి అద్భుత కుమార్ తెలిపారు. గురువారం స్థానిక బర్మాశాలలోని తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆవరణలోజరిగిన యూత్ సమావేశానికి అద్భుత సునేవిరాజ్, బ్రదర్ హానోక్ రాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఫాదర్ విజయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్రీస్తు మహిమలను తెలుసుకొని భక్తి మార్గంలో పయనించాలని సూచించారు.



మాట్లాడుతున్న సిస్టర్ సునేమి అద్భుత కుమార్